



**మంత్రి** సుబ్బరాజుగారు టూర్ ప్రోగ్రామ్ ముందుగానే పేపర్లో ప్రకటించడంవల్ల వెండికొండ డామ్ ప్రాంతానికి జిల్లా ఎమ్మెల్యేలు, సమితి అధ్యక్షులు, పార్టీ నాయకులు, వారి వెంట చోటా కార్యకర్తలు హడావుడిగా విచ్చేశారు.

సాయంకాలం ఆరున్నరకి రిజర్వాయర్ గెస్ట్ హవుస్ 'ఊర్వశి' లాన్స్ జనసందోహంతో మునిగిపోయాయి. మంత్రిగారు కారు దిగడం, పూల దండలతో స్వాగతం పలకడం, ఫ్లాష్ కెమెరాలు క్లిక్ మనడం యథావిధిగా జరిగిపోయాయి.

ఆంజనేయ వరప్రసాద్ ఆ జన సామాన్యంలో ఒక మూల దిగబడి పోయాడు. ఆ హడావుడి చూసి తను మంత్రిగారిని కలుసుకోగలనా లేదా అని సందేహించాడు. కాని తప్పదు గదా! మానవప్రయత్నంచేయాలిఅనుకున్నాడు.

మరునాడు అధికారులతో మీటింగ్ ఉందనీ, తను విశ్రాంతి తీసుకోవాలనీ మంత్రిగారు అందర్నీ వీలైనంత త్వరగా పంపేశారు. అయినా సుబ్బరాజుగారు ఎ.సి.డైనింగ్‌హాల్లో భోజనానికి కూర్చునే సరికి తొమ్మిది దాటింది.

"మంత్రిగారు ఇప్పు డెవర్నీ చూడ రయ్యా, మగడా! చెప్తుంటే వినిపించుకోవేం?'' అని ఆయన కార్యదర్శి విసుక్కున్నాడు.

ఆంజనేయ వరప్రసాద్ మాత్రం దిక్కుముఖం వేసి బతిమాలి కాళ్ళు పట్టుకున్నంత పని చేసి కార్యదర్శిని ప్రసన్నం చేసుకోగలిగాడు.

"నీ విజిటింగ్ కార్డు ఆయనముందు పెడతాను. ఆ తర్వాత నీ అదృష్టం'' అన్నాడు.

"అంతే చాలు,సార్. మా ఇంటి పేరు చూస్తే మంత్రిగారికి అంతా జ్ఞాపకం వస్తుంది. మా తాతగారూ, ఆయనా తిమ్మన్నపురం జైల్లో ఉన్నారు కొంత కాలం'' అన్నాడు ఆంజనేయ వరప్రసాద్.

కాకరకాయల ఆంజనేయ వరప్రసాద్ పేరు చూసి మంత్రిగారు రమ్మంటూ కబురు చేశారు.

అతను తడబడుతున్న అడుగులతో ఎ.సి. గదిలోకి ప్రవేశించి రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాడు.

"కొంపతీసి కాకరకాయల తాతయ్య మనవడివే నేమిటోయ్ నువ్వు?'' అంటూ మంత్రి సుబ్బరాజుగారు ప్రశ్నించారు.

"అవున్సార్... నేను ఆయన

మనవడిని.'' నవ్వు ముఖంతో అన్నాడు.

"ఏవి టీవేళప్పుడొచ్చావు? మీ తాత గారు బాగున్నారా?''

''ఆయన పోయి పదేళ్ళు దాటింది, సార్.''

''అవును కదూ! మర్చేపోయాను. ఈ హడావుడిలో ఏదీ గుర్తుండి చావదు. ఇంతకీ నీ పనేమిటి? త్వరగా కానీ.'' కొంచెం చిరాకు ధ్వనించింది మంత్రిగారి మాటల్లో.

'నేను కాలవలు త్రవ్వే కార్పొరేషన్లో సూపర్వైజర్‌గా పన్జేస్తున్నాను, సార్. నన్ను గుంటూరు నుంచి గుంతకల్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు, సార్.'' పాఠం అప్పజెప్పినట్లు చెప్పాడు ఆంజనేయ వరప్రసాద్.

"అయితే ఏమంటావు?''

"గుంటూరుకీ గుంతకల్‌కీ ఎంత దూరమో తమకు తెలుసు కదా, సార్. అందుకని రేపు ఇక్కడకు వస్తున్న చీఫ్ ఇంజనీర్‌గారికి చెప్పి. . .!''

మంత్రిగారు అందుకుని—"చూడు, మిస్టర్. మూడేళ్ళు దాటినవాళ్ళని ఎక్కడివాళ్ళ నక్కడినుంచి ట్రాన్స్‌ఫర్ చెయ్యమని నేనే ఆర్డర్ వేశాను. నేనే కాన్సిల్ చేయమని చెప్పడం బాగోదు'' అన్నారు ముఖం మాడ్చుకుని.

"కాన్సిల్ చెయ్యక్కర్లేదు, సార్! చిన్న మార్పు. గుంటూరు నుంచి గుంతకల్‌కు బదులు బెజవాడకు వేస్తే చాలు, సార్!'' ప్రాధేయపడ్డాడు.

"చూడబ్బాయ్! మీ తాతా, నేనూ స్నేహితులమే. ఆ పరిచయాన్ని పురస్కరించుకుని నువ్విలా వచ్చి నన్ను ఇబ్బంది పెట్టడం ఏం భాగాలేదు. మీ తాత బ్రతికుండగా నన్ను ఒక్క సాయం కూడా కోరలేదు'' అన్నారు సుబ్బరాజా గారు.

ఆంజనేయ వరప్రసాద్ ఏడవలేక నవ్వుముఖం పెట్టి ఇబ్బందిగానిల్చున్నాడు.

"అయినా ఉద్యోగం చేసేవాడు సొంతవూళ్ళోనేకావాలంటే ఎట్లాగయ్యా? ఎక్కడికైనా పోవాలి. ఎక్కడైనా పని చెయ్యాలి. లేకపోతే దేశం బాగుపడేది ఎట్లా?'' అన్నారు కోపంగా.

"సార్! మీ రలా అంటే నేనేం చెప్పలేను. మా తాతగారి పేరు చెప్పుకుని మిమ్మల్నేమీ అడగలేదు ఇంతవరకూ.''

"ఇదుగో,బాబూ! ఇది తప్ప మరేదైనా అడుగు. ముందు గుంతకల్ వెళ్ళి జాయిన్ అవ్వు. తర్వాత చూద్దాం.''

"సార్. . .సార్!. . .పిల్లలు కలవాడిని, సార్!'' ఏడుపు ముఖం పెట్టాడు ఆంజనేయ వరప్రసాద్.


"నువ్వెన్ని చెప్పినా లాభం లేదు. నేను మాత్రం ట్రాన్‌ఫర్ గురించి చీఫ్ ఇంజనీర్‌కి చెప్పను. ఇంత చిన్న విషయం అతనికి సిఫార్సు చేస్తే ఇక నాకేం విలువ ఉంటుంది చెప్పు?'' అన్నారు మంత్రిగారు.

అప్పుడు ప్రసాద్ బుర్రలో ఒక మెరుపు మెరిసింది.

"సార్! మీరు చీఫ్ ఇంజనీరుగారితో నోటి మాట ఏమీ చెప్పనవసరం లేదు.''

"మరేం చెయ్యమన్నావు? కాగితం మీద రాసివ్వమన్నావా ఏం? అసాధ్యుడి లాగున్నావే?'' నవ్వబోయి ఆగిపోయారు మంత్రిగారు.

"అది కూడా అవసరంలేదు, సార్!''




"మరేమిటి?'' ఆశ్చర్యంతో ప్రశ్నించారు.

ఆంజనేయ వరప్రసాద్ చెప్పాడు.

అది విని సుబ్బరాజు అతగాడి తెలివికి లోలోపల మెచ్చుకుంటూ 'సరే' అన్నారు.

అతను ఆనందంతో సెలవు తీసుకున్నాడు.

● ● ●

మర్నాడు కాలవల కార్పొరేషన్ అధికారుల మీటింగ్ పూర్వాశి గెస్ట్ హవుస్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో మొదలైంది.

మంత్రి సుబ్బరాజుగారు విశాలమైన సోఫాలో కూర్చున్నారు. అధికారులంతా కొంచెం దూరంలో తమతమ స్థానాల్లో ఆసీనులై ఉన్నారు. అందరి ముందూ ఫైల్సు ఉన్నాయి. మీటింగ్ ఇంకా మొదలు కాలేదు. గెస్ట్‌హవుస్ అటెండర్ అందరికీ కూల్‌డ్రింక్స్ అందిస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే ఆంజనేయ వరప్రసాద్ కాన్ఫరెన్సు హాలులోకి ప్రవేశించాడు. మంత్రి సుబ్బరాజుగారికి నమస్కారం చేసి నిల్చున్నాడు.

మంత్రిగారు అతన్ని చూసి నవ్వారు.

"రావోయ్! ప్రసాద్. . .రా. . . ఏమిటి సంగతి?'' అంటూ కుశల ప్రశ్నలు వేశారు.

అతను మంత్రిగారి దగ్గరికి వెళ్ళి ఇబ్బందిగా అధికారుల వంక చూస్తూ "బాగున్నారా? — మీరొచ్చారని తెలిసి చూద్దామని వచ్చాను. అంతే. . .!'' అంటూ చిరునవ్వులు చిందించాడు.

"అలాగా!. . .రా. . .కూర్చో. . మనింట్లో అంతా బాగున్నారా? ఏదీ మీ తాతగారు పోయిన దగ్గర్నుంచీ రావాలనుకుంటూనే . . . కుదరటం లేదు. ఎప్పుడూ హడావుడే. . !'' అంటూ మంత్రిగారు నవ్వారు.

కాకరకాయల ఆంజనేయవరప్రసాద్ మంత్రిగారి ప్రక్కన అర్ధ సింహాసనం ఆక్రమించుకుని దర్జాగా కూర్చున్నాడు.

మీటింగ్ పూర్తయ్యాక మంత్రిగారు భోజనానికి బయల్దేరారు. అధికారులు ఒక్కొక్కరే కాన్ఫరెన్స్ హాలు దాటి వస్తున్నారు.

చీఫ్ ఇంజనీర్ గారు రాగానే ఆంజనేయ వరప్రసాద్ విష్ చేసి చిరునవ్వు నవ్వాడు.

చీఫ్ ఇంజనీర్‌గారు అతన్ని చూసి, "మిస్టర్ ప్రసాద్ హావు డూ యూ డూ. . .'' అంటూ ఆప్యాయంగా పలకరించారు.

"ఒ.కె.సార్.''

"ఏమి టిలా వచ్చావు?''

"మంత్రిగారూ...మా తాతగారూ ..

చీఫ్ఇంజనీర్ గారు అందుకుని "తెలుసు. . . తెలుసు. మంత్రిగారు అంటుండగా విన్నానువూ'' అన్నారు.

"వూరికే కలవాలని వచ్చా సార్.''

"అంతేనా? ఎక్కడ పని చేస్తున్నావు?''

"సార్! ప్రస్తుతం గుంటూరులో సార్. కాని నన్ను గుంతకల్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు సార్. కాని. . .సార్. . . చాలా దూరమే సార్. . .'' అతను హి. . .హి. . .అన్నాడు నవ్వలేక నవ్వుతూ.

"సో. . .దగ్గరి వూరు కావాలంటావు?''

"బెజవాడ దగ్గర సార్.''

"ఒ.కె. డట్సాల్ రైట్'' అన్నారు చీఫ్ఇంజనీర్.

ఆంజనేయ వరప్రసాద్ 'హమ్మయ్య' అని దీర్ఘంగా విట్టూర్చాడు. ★